సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 12 । జూలై । 2024



ఆస్తి తగాదాలతోనే హత్య

ఆస్తి తగాదాలు, ఆర్థిక లావాదేవీలే కమ్మరి కృష్ణ అలియాస్ కేకే హత్యకు కారణమని తెలుస్తోంది. 10లో▸



రిజిస్ట్రేషన్ల కోసం..

సాంకేతిక లోపంతో సర్వర్ పనిచేయక జిల్లాలోని పలు కార్యాలయాల్లో గురువారం రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. 10లో▸



22న చలో కలెక్టరేట్

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 22న చలో కలెక్టరేట్ చేపట్టినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్ తెలిపారు. 10లో▸

న్యూస్‌రీల్

జనాభా నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర రావు

తుర్కయంజాల్: జనాభా పెరిగితే పరిమితమైన వనరులు, నీరు, ఆహారం మొదలైన వాటి మధ్య సమతుల్యత లోపించి అనేక ఇబ్బందులు తలెత్తుతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకటేశ్వర రావు అన్నారు. జిల్లా కార్యాలయంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో జనాభా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ప్రణాళికలు రూపొందించి అమలు పరచడమే కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. గతంలో జనాభా నియంత్రణకు ట్యూబెక్టమి, వ్యాసెక్టమీ వంటి శాశ్వత శస్త్ర చికిత్సలను ప్రోత్సహించే వారని, ప్రస్తుతం అలాంటి వాటితో పాటు, బిడ్డకూ బిడ్డకూ మధ్య ఎడం పాటించడానికి నోటి మాత్రలు, ఇతర పద్ధతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కుటుంబ నియంత్రణ కోసం జిల్లాలో 11,600 మందికి ఐయూసీపీ, 12,963 మందికి కండోమ్‌లు పంపిణీ చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు, ప్రోగ్రాం ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకం భేష్

యాచారం: గ్రామీణ ఉపాధి నిధులతో పండ్ల తోటల పెంపకం చేపట్టి రైతులు ఆర్థిక ప్రగతి సాధించడం అభినందనీయమని ఎన్ఐఆర్‌డీ అధికారులు బృందం కితాబిచ్చింది. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడలో గురువారం ఎన్ఐఆర్‌డీ కోర్స్ డైరెక్టర్ లఖన్‌సింగ్ ఆధ్వర్యంలో జమ్ముకశ్మీర్, నాగాలాండ్, ఒడిశా, కేరళ, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఎన్ఐఆర్‌డీలో శిక్షణ పొందుతున్న 16 మంది అధికారుల బృందం పర్యటించింది. గ్రామంలో ఈజీఎస్ నిధులతో పెంచుతున్న జామ, సీతాఫలం, పాంపాండ్, కమ్యూనిటీ ప్లాంటేషన్, పల్లె ప్రకృతి వనం, నర్సరీని పరిశీలించారు. గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలు నడుపుతున్న కారం మిల్లును సందర్శించారు. గ్రామంలోని రైతులు, మహిళలతో మాట్లాడి ఈజీఎస్ నిధులతో పండ్లతోటల పెంపకంతో లాభాలు ఎలా గడిస్తున్నారో తెలుసుకుని అభినందించారు. గ్రామంలోని పలువురు రైతుల వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి ఈజీఎస్ నిధులను ఎలా సద్వినియోగం చేసుకున్నారు.. ఈజీఎస్ అధికారుల సహకారం గురించి ఆరా తీశారు. పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పరిపాలన తీరుపై అధ్యయనం చేశారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. ఈజీఎస్ సిబ్బందితో మాట్లాడి వేతనాలు సకాలంలో అందుతున్నాయా, కూలీ గిట్టుబాటు అవుతుందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతులు, మహిళలు, నిరుద్యోగులు తమకు ఆసక్తి కలిగిన రంగాల్లో ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి, యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఏపీడీ సుక్రియా, మండల పంచాయతీ అధికారి శ్రీలత, ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దీపిక పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు



కొండన్నగూడలో టమాటా పంటను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

షాద్‌నగర్‌రూరల్: రైతులు ఆయిల్‌పాం పంటలను సాగు చేస్తే అధిక లాభాలు పొందొచ్చని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని వెల్జర్ల, కొండన్నగూడ గ్రామాల్లో రైతులు సాగు చేసిన ఆయిల్ పాం, ఉద్యానవన పంటలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు, మెలకువలు పాటిస్తే దిగుబడి పెరుగుతుందని అన్నారు. పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యానవన పంటల సాగుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. కూరగాయలు, ఆకుకూరల సాగుతో అధిక లాభాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి నీరజ గాంధీ, సెరికల్చర్ జిల్లా ఏడీ ముత్యాలు, హార్టికల్చర్ అధికారిణి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

‘పవర్’ ప్లాన్!

జిల్లాలో కొత్తగా 25 సబ్‌స్టేషన్లు

- సైబర్‌సిటీ సర్కిల్‌లో ఆరు, రాజేంద్రనగర్‌లో 14
- సరూర్‌నగర్‌లో 5 చొప్పున ఏర్పాటుకు నిర్ణయం
- ఫీడర్లపై ఒత్తిడి తగ్గించేలా డిస్కం చర్యలు
- నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- భూములు కేటాయించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి





సాక్షి, రంగారెడ్డి జిల్లా: శరవేగంగా అభివృద్ధి పథంలో సాగుతున్న జిల్లాలో అదేస్థాయిలో విద్యుత్ డిమాండ్ సైతం పెరుగుతోంది. నగర శివారుగా ఉండటంతో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కట్టడమేకాక పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య సంస్థలు, గృహ సముదాయాలు కూడా ఈ భారీగా వెలుస్తున్నాయి. దీంతో విద్యుత్ వినియోగం రికార్డుస్థాయిలో నమోదవుతోంది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లోని సబ్ స్టేషన్లు, ఫీడర్లు ఒత్తిడికి గురవుతూ తరచూ సాంకేతిక సమస్యలకు కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కొత్తగా మరో 25 సబ్‌స్టేషన్లు (33/11 కేవీ) నిర్మించాలని డిస్కం నిర్ణయించింది. ఈ మేరకు అవసరమైన భూమిని కేటాయించాలని కోరుతూ కలెక్టర్ శశాంకకు ఇటీవల లేఖ రాసింది. దీనికి ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ప్రతిపాదిత ప్రదేశాలు ఇవే..

సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలోని నెక్నంపూర్, బొటానికల్ గార్డెన్, నల్లగండ్ల (హుడా), హఫీజ్‌పేట్, 8వ పోలీసు బెటాలియన్‌లలో 2 వేల గజాల చొప్పున, మంచిరేవులలో సబ్ స్టేషన్ల నిర్మాణానికి 24,200 గజాల చొప్పున భూమి కేటాయించాలని కలెక్టర్‌ను డిస్కం కోరింది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హిమాయత్‌సాగర్ సమీప పీ అండ్ టీ కాలనీ, బైరాగిగూడ, ఓంనగర్, సాతంరాయిలతో 1,500 గజాల చొప్పున, లక్ష్మీగూడ హౌసింగ్‌బోర్డు కాలనీ, బండ్లగూడ సర్వే నంబర్ 82లో, రీగల్ కన్వెన్షన్‌లలో 2 వేల గజాల చొప్పున, శంషాబాద్ హుడా కాలనీ, పద్మావతి కాలనీ, మీరాలం పార్కు, రాజేంద్రనగర్ ఆర్డీఓ ఆఫీసు, కాటేదాన్‌లోని కింగ్స్ కాలనీ, జల్‌పల్లిలోని నూరినగర్, బండ్లగూడలోని మమ్మద్‌నగర్‌లలో 1,500 గజాల చొప్పున స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఫతుల్లాగూడ, కుంట్లూరులోని మదర్ డెయిరీ, బీఎన్‌రెడ్డి సమీపంలోని సాహెబ్‌నగర్, బడంగ్‌పేట్ డంపింగ్ యార్డ్, మన్సూరాబాద్ పెద్ద చెరువు వద్ద 2 వేల గజాల చొప్పున స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేసింది.

గ్రేటర్‌లో 34 సబ్‌స్టేషన్లు

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజుకు సగటున 3,500 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతోంది. ప్రతినెలా 2,500పైగా కొత్త కనెక్షన్లు మంజూరవుతున్నాయి. ఒకప్పుడు ధనవంతుల ఇళ్లలో మాత్రమే కనిపించే ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఓవెన్లు, గీజర్లు ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ సర్వసాధారణమయ్యాయి. ఫలితంగా సామర్థ్యానికి మించి విద్యుత్ వినియోగిస్తుండటంతో సబ్‌స్టేషన్లు ఒత్తిడికి లోనవుతున్నాయి. దీనికి కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటే పరిష్కారమని డిస్కం భావించింది. ఈ మేరకు రూ.315 కోట్ల అంచనా వ్యయంతో రంగారెడ్డి సహా హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో మొత్తం 34 సబ్‌స్టేషన్లు (33/11కేవీ) నిర్మించాలని నిర్ణయించింది.

జిల్లాలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ ఇలా..

400 కేవీ సబ్‌స్టేషన్లు	4
220/132 కేవీ సబ్‌స్టేషన్లు	10
132/33 కేవీ సబ్‌స్టేషన్లు	23
33/11 కేవీ సబ్‌స్టేషన్లు	241
సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు	14,070
త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు	60,320
రోజు సగటు విద్యుత్ వినియోగం	23.6 ఎంయూలు
అత్యధిక విద్యుత్ డిమాండ్	856.94 మెగావాట్లు
వ్యవసాయ కనెక్షన్లు	1,21,234
గృహ విద్యుత్ కనెక్షన్లు	16,78,468
వాణిజ్య కనెక్షన్లు	2,55,638
పరిశ్రమలు	16,118
వీధి దీపాలు	12,281
వాటర్ వర్క్స్ కనెక్షన్లు	5,232
ఇతర కనెక్షన్లు	10,806



లష్కర్‌గూడలో గీత కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

గీత కార్మికులకు ‘లైఫ్ సేవ్’

- 14న సీఎం చేతుల మీదుగా కిట్స్ పంపిణీ
- లష్కర్‌గూడలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ శశాంక

అబ్దుల్లాపూర్‌మెట్: తాటి చెట్లు ఎక్కే క్రమంలో కల్లు గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా లైఫ్ సేవ్ కిట్స్ పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికులకు వీటిని అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 14న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో నిర్వహించే ఈ కార్యక్రమం కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్సైజ్, రెవెన్యూ, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో కలిసి గురువారం కలెక్టర్ శశాంక వేదిక స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పలువురు గీత కార్మికులకు లైఫ్ సేవ్ కిట్స్ అందించి ప్రయోగాత్మకంగా తాటి చెట్లు ఎక్కించారు. లైఫ్ సేవ్ కిట్స్ ధరించడంలో ఏవైనా ఇబ్బందులున్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి హాజరయ్యే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

చదువుతోనే జీవితంలో మార్పు

ఇబ్రహీంపట్నం: చదువే జీవితంలో మార్పు తీసుకొస్తుందని.. విద్యార్థులు మనసు పెట్టి కష్టపడి చదవాలని కలెక్టర్ శశాంక సూచించారు. ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వాస్పత్రి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చదవుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు పెరుగుతుందని.. భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందన్నారు. పదో తరగతి ప్రథమ మెట్టులాంటిదని.. నైపుణ్యాభివృద్ధిని పెంచుకోవాలన్నారు. విద్యార్థుల వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఆన్‌లైన్ ప్రక్రియకు సంబంధించి కంప్యూటర్ ఆపరేటర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి దరఖాస్తుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం సహించం

ఇబ్రహీంపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో మందులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆయన ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ వెంకటమ్మ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్

ప్రకాష్ గౌడ్.. కాంగ్రెస్‌లోకి దౌడ్!

- నేడు హస్తం గూటికి చేరనున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే



సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్‌కు మరో షాక్. ముందుగా ఊహించినట్లే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కారు దిగి.. హస్తం గూటికి చేరనున్నారు. ఆయనతో పాటు మరికొంత మంది నేతలు పార్టీని వీడే అవకాశం ఉంది. ఆయన ఏ ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నా.. ముందుగా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఆ మేరకు ఇదే అంశంపై బుధవారం క్షేత్రస్థాయి కేడర్‌తో చర్చించిన అనంతరం గురువారం తిరుమలకు బయలుదేరి వెళ్లారు. స్వామి దర్శనం తర్వాత శుక్రవారం నేరుగా సీఎం రేవంత్‌రెడ్డికి ఇంటికి చేరుకుని కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఆయనతో పాటు మణికొండ, బండ్లగూడ జాగీర్, శంషాబాద్ మున్సిపాలిటీలకు చెందిన కీలక నేతలు కూడా పార్టీ మారే అవకాశం ఉన్నట్లు తెలిసింది. టీడీపీ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన ప్రకాష్‌గౌడ్.. 2009, 2014లలో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి అదే పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. ఇప్పటికే రెండు పార్టీలు మారిన ఆయన తాజాగా కాంగ్రెస్ గూటికి చేరనుండటం చర్చనీయాంశంగా మారింది.

అప్పట్లోనే పార్టీ కండువాతో ప్రత్యక్షం..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ప్రకాశ్ గౌడ్ ప్రత్యక్షమయ్యారు. ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి సమక్షంలో ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పారు. అయితే.. క్షేత్రస్థాయి కేడర్ నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో చేరికను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు మాట మార్చారు. ఆ తర్వాత కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రెండు సార్లు కలిశారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లి హైదరాబాద్ శివారు ఎమ్మెల్యేలంతా కలిసికట్టుగా పార్టీలోనే ఉంటామని, ప్రతిపక్ష పాత్ర గట్టిగా పోషిస్తామని హామీ ఇచ్చి వచ్చారు. నాలుగు రోజుల క్రితం బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో జీహెచ్ఎంసీలో వ్యవహరించాల్సిన తీరుపై మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలోనూ ప్రకాశ్ గౌడ్ పాల్గొన్నారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, వివేకానంద, బండారి లక్ష్మారెడ్డితో కలిసి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిశారు. త్వరలోనే వీరంతా పార్టీ మారనున్నట్లు ప్రచారం కూడా జరిగింది. కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని తాజాగా ఆయన ప్రకటించి.. పార్టీ మార్పు ఊహాగానాలకు తెరదించారు.

ప్రజా శ్రేయస్సుకే..

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అనేక పనులు మధ్యలో ఉండటంతో పాటు మరికొన్నింటిని మొదలు పెట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. వాటిని సాధించి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించేలా చేయాలనే ఉద్దేశంతో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నా. నాతో పాటు బీఆర్ఎస్ పార్టీలో కొనసాగిన ఓ ప్రజాప్రతినిధి, నాయకులు, కార్యకర్తలు సైతం కాంగ్రెస్‌లో చేరుతారు.

– ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్యే



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ నిర్మల, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సభ్యులు

అక్రమ రవాణాను అరికట్టాలి

- డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నిర్మల

చేవెళ్ల: మానవ అక్రమ రవాణ నిర్మూలనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని డీఆర్‌డీఏ జిల్లా మేనేజర్ నిర్మల, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో గురువారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, డీఆర్‌డీఏ ఆధ్వ ర్యంలో వీఓఏలకు రెండురోజుల శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే మూడో అతిపెద్ద నేరమని అన్నారు. నిత్యం ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు ఎక్కువగా దీని బారిన పడుతున్నారని తెలిపారు. పేద, మధ్య తరగతికి చెందిన వారు ఉద్యోగం, ప్రేమ, పెళ్లి, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారని అన్నారు. గుడ్డిగా ఎవరినీ నమ్మకూడదని చెప్పారు. దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని చెప్పారు. ఉద్యోగాలు ఉన్నాయని, ప్రేమిస్తున్నామని, పెళ్లిచేసుకుంటామని నమ్మించి మోసం చేసి మానవ అక్రమ రవాణాకు ఉపయోగిస్తుంటారని వివరించారు. మానవ అక్రమ నిర్మూలన కోసం ప్రజ్వల సంస్థ 28 ఏళ్లుగా పనిచేస్తూ 28,600 మంది అమ్మాయిలను రక్షించి పునరావాసం కల్పించినట్లు చెప్పారు. సంస్థ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సునీత కృష్ణన్ లైన్ డిపార్ట్‌మెంట్‌ల సహకారంతో పనిచేయటం జరుగుతుందన్నారు. జిల్లాలో డీఆర్‌డీఏలోని వీఓఏలకు శిక్షణ ఇచ్చి, వారి ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ.. ఏవైనా సమస్యలుంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించేలా చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో వీఓఏలకు ఎలా మానవ అక్రమ రవాణా జరుగుతుంది..లైంగిక వ్యాపారంలోకి వెళ్లిన అమ్మాయిల పరిస్థితులు ఎలా ఉంటాయి.. ఎలా వీటిని అరికట్టాలనే దానిపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ సంఘాల ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించి చైతన్యం చేయాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం శోభారాణి, ప్రజ్వల సిబ్బంది సురేశ్, కుమార్, అనిల్, అంబర్‌సింగ్, మిథాలిరాజ్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

- తేల్చి చెప్పిన సిద్ధాపూర్ రైతులు
- పరిహారం విషయంలో అన్యాయం చేశారని ఆరోపణ
- భూసేకరణ పొలాల్లో ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

కొత్తూరు: తమకు ప్రభుత్వం న్యాయం చేసే వరకు పోరాటం ఆగదని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన బాధిత రైతులు తేల్చిచెప్పారు. ఈ మేరకు భూసేకరణ చేసిన పొలాల్లో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూసేకరణలో అధికారులు నిబంధనలు పాటించలేదని అన్నారు. ప్రక్రియను మొదలు పెట్టడానికి ముందు గ్రామంలో కనీసం టాంటాం వేయించలేదని, గ్రామసభ నిర్వహించి పరిహారంపై చర్చించిన దాఖలాలు లేవన్నారు. అప్పటి గ్రామ సర్పంచ్ భర్త, అప్పటి ఆర్డీఓ రాజేశ్వరి, ఇతర అధికారులు బాధిత రైతులను సంప్రదించకుండా పరిహారాన్ని నిర్ణయించినట్లు విమర్శించారు. భూసేకరణలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించలేదని.. స్థానిక ప్రజాప్రతినిధి, ఆయన కోటరీ చెప్పిన వారి పేర్లు మాత్రమే అర్హుల జాబితాలో చేర్చినట్లు ఆరోపించారు. భూసేకరణ జరిపిన రైతుల్లో చాలామందికి తమకు రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి పరిహారం రాలేదన్నారు. నాలుగెకరాలు ఉన్న రైతుకు ఎకరానికి మాత్రమే పరిహారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. భూములకు సంబంధం లేని వ్యక్తులకు పరిహారం ఎలా అందిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమకు అన్యాయం జరుగుతోందని అప్పటి ఆర్డీఓతో పాటు జిల్లా అధికారులు, గత ప్రభుత్వానికి విన్నవించినా న్యాయం జరగలేదని వాపోయారు. దీంతో తాము హైకోర్టును ఆశ్రయించామని, కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టు తీర్పును అమలు చేయకుండా అప్పటి బీఆర్ఎస్ నాయకులు అధికారులను ప్రలోభపెట్టినట్లు ఆరోపించారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, జంగయ్య, కృష్ణ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

36 గుంటలకే..



టీజీఐఐసీ సేకరించిన పొలాల్లో సర్వే నంబర్ 252లో 4–01 ఎకరాల అసైన్డ్ పొలం ఉంది. అధికారులు 36 గుంటలకు మాత్రమే పరిహారం అందించారు. మిగిలిన పొలం కోసం ఆర్డీఓ, ఇతర అధికారులను అడిగితే సమాధానం లేదు.

– పట్నం బాలయ్య, బాధిత రైతు, సిద్ధాపూర్

రూ.3 లక్షలే ఇచ్చారు



ప్రభుత్వం సేకరించిన పొలాల్లో నా పేరున సర్వే నంబర్ 252, 306, 323, 309లో 1–05 గుంటల పొలం ఉంది. ప్రభుత్వం నుంచి రూ.13 లక్షలు పరిహారం అందాల్సి ఉండగా రూ.3 లక్షలు మాత్రమే అందాయి.

– మైసయ్య, బాధితరైతు, సిద్ధాపూర్

జాబితాలో పేరు లేదు..



టీజీఐఐసీ సేకరించిన పొలాల్లో నా పేరుపై రెండెకరాల పొలం ఉంది. అధికారులు గుర్తించిన జాబితాలో నా పేరు లేదు. ఇప్పటి వరకు పరిహారం అందలేదు. పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు.

– జంప్లా, బాధిత రైతు, సిద్ధాపూర్

విద్యుదాఘాతానికి ఇంటర్ విద్యార్థి మృతి



బన్ని (ఫైల్)

నందిగామ: విద్యుదాఘాతానికి గురై ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై గోపాల కృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొమ్మగళ్ల బన్ని(19) తన ఇంట్లోని సంపులో మోటారు ఆన్‌చేసి పైపును సర్దుతుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ గురై కుప్ప కూలిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోటారు వద్ద వైరు తేలిపోవడంతో విద్యుత్ సరఫరా అయి ప్రమాదం జరగవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వీధి కుక్క దాడిలో చిన్నారికి గాయాలు



గాయపడిన సాయి భార్గవి

కందుకూరు: వీధి కుక్క దాడిలో ఓ చిన్నారికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కందుకూరు చౌరస్తాలోని ఓ వీధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు చౌరస్తాలో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి సాయిభార్గవి(6)పై వీధి కుక్క దాడి చేసింది. దీన్ని గమనించిన స్థానికులు కుక్కను తరమడంతో ఆ చిన్నారి ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది.

కామాంధుడి అరెస్ట్



నిందితుడు నర్సింహ

ఇబ్రహీంపట్నం: ఎనిమిదేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి యత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఓ గ్రామానికి చెందిన బోడ నర్సింహ(50) అదే గ్రామానికి చెందిన బాలికకు చాక్లెట్ ఇస్తానని ఆశ చూపి అత్యాచారయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

ఆర్టీసీ కార్గో ఏజెంట్లకు ఆహ్వానం

రాయదుర్గం: టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ (కార్గో) గచ్చిబౌలి హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో పరిధిలో కార్గో ఏజెంట్ల నియామకం ఉందని ఆసక్తి ఉన్నవారు సంప్రదించాలని ప్రతి ఏజెంట్ రూ.10వేలు (నాన్ రిఫండబుల్) చెల్లించాలని తెలిపారు. ఒక్క పార్సిల్ పైన 15 శాతం కమీషన్ ఉంటుందని డిపో అధికారులు తెలిపారు. ప్రతి ఏజెంట్ కంప్యూటర్, ప్రింటర్ కలిగి ఉండాలని తెలిపారు. బుక్ చేసిన ప్రతి పార్సిల్‌ను కార్గో బస్సు తీసుకెళుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు హెచ్‌సీయూ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ విజేందర్‌రెడ్డిని సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు.

ఆస్తి తగాదాలతోనే కేకే హత్య?

- అన్ని కోణాల్లో కొనసాగుతున్న దర్యాప్తు
- పోలీసులతో అదుపులో ముగ్గురు నిందితులు
- బండ్లగూడలో కమ్మరి కృష్ణ అంత్యక్రియలు పూర్తి

షాద్‌నగర్ రూరల్: ఆస్తి తగాదాలు, ఆర్థిక లావాదేవీలే కమ్మరి కృష్ణ అలియాస్ కేకే హత్యకు కారణమని తెలుస్తోంది. నేరాలకు పాల్పడుతూ రూ.కోట్లకు పడగలెత్తిన ఈయన రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో అనేక అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. కుటుంబ సభ్యులను సైతం తన అనుచరులతో బెదిరించి, దాడులు చేయించడంతో బంధువులకు సైతం విలన్‌గా మారాడు. ఇటీవల తన మూడో భార్య పేరున రూ.15 కోట్ల ఆస్తి మార్పిడి చేసినట్లు వినికిడి. ఇది నచ్చని మొదటి భార్య తరఫు వారే బాడీగార్డ్ బాబాతో.. కేకేను హత్య చేయించారని విశ్వసనీయంగా తెలుస్తోంది. అసలు వాస్తవాలను తెలుసుకునే దిశగా పోలీసుల విచారణ కొనసాగుతోంది.



యజమాని కృష్ణతో బాడీగార్డు బాబా

మూడు పెళ్లిళ్లు..

గండిపేట మండలం హైదర్షాకోట్‌కు చెందిన కమ్మరి కృష్ణ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. మొదటి భార్య పక్షవాతంతో మంచానికే పరిమితమైంది. ఆతర్వాత రెండో వివాహం చేసుకోగా ఆమె అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో పావని అనే మహిళను మూడో పెళ్లి చేసుకున్నాడు. ఈమెను కమ్మదనంలోని ఫాంహౌస్‌లో పెట్టి అప్పుడప్పుడూ వచ్చి వెళ్తుండేవాడు. కొన్నేళ్ల క్రితం ఓ రేషన్ డీలర్‌ను హత్య చేసిన కేసులో కృష్ణ నిందితుడిగా ఉన్నాడు.

పది రోజుల క్రితం విధుల్లోకి

రాజేంద్రనగర్ నియోజకవర్గం కిస్మత్‌పూర్‌కు చెందిన బాబా అలియాస్ శివానంద్ కొన్నేళ్లు కృష్ణ వద్ద బాడీగార్డుగా పని చేశాడు. కేకే చేసే అన్ని నేరాల్లో అతనికి అండగా నిలిచాడు. ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో ఏడాది క్రితం పనినుంచి తొలగించాడు. పది రోజుల క్రితం కృష్ణ వద్దకు వచ్చి ప్రాధేయపడటంతో తిరిగి బాడీ గార్డుగా నియమించుకున్నాడు.

డమ్మీ పిస్టల్‌తో బెదిరింపులు

ఫాంహౌస్‌లో కృష్ణపై కత్తితో దాడి చేసిన అనంతరం బాబా వారి కుటుంబ సభ్యులను డమ్మీ పిస్టల్‌తో బెదిరించినట్లు సమాచారం. ఫాంహౌస్ నుంచి వారు పారిపోతున్న క్రమంలో డమ్మీ పిస్టల్ అక్కడే పోయింది. హత్యకు ఉపయోగించిన కత్తులు, కారుతో పాటు డమ్మీ పిస్టల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. బాబాతో పాటు హత్యలో భాగస్వాములైన మరో ఇద్దరు వ్యక్తులు పోలీసుల కస్టడీలో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా గురువారం సాయంత్రం బండ్లగూడలో కృష్ణ అంత్యక్రియలు నిర్వహించారు.

ఐదు క్వింటాళ్ల బియ్యం పట్టివేత

యాచారం: ప్రైవేట్ వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని యాచారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కడ్తాల్ మండల పరిధిలోని పల్లెచల్క తండాకు చెందిన ఇస్లావత్ జగన్ గురువారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ వాహనంలో తక్కళ్లపల్లి గేట్ నుంచి 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గ్రామాల్లో పేదల నుంచి కిలో రూ.10ల చొప్పున రేషన్ బియ్యాన్ని సేకరించి పౌల్ట్రీఫాంలకు కిలో రూ.25 చొప్పున విక్రయిస్తున్నట్లు జగన్ పోలీసుల విచారణలో తెలిపారు. పోలీసులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహన డ్రైవర్ జగన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ సస్పెన్షన్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం సెక్షన్ ఆఫీసర్ కబీర్ ఉల్లాఖాన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఉప్పర్‌పల్లి ప్రాంతంలోని తమ పొలం గుండా రోడ్డు నిర్మించినందున నష్టపరిహారం ఇవ్వాలని ముక్రముద్దీన్ ఖాన్ అనే రైతు దరఖాస్తు చేశాడు. అప్పట్లో ఈ విషయమై రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం డీసీపీ కృష్ణమోహన్‌తోపాటు సెక్షన్ ఆఫీసర్ కబీర్ ఉల్లాఖాన్ తప్పుడు నివేదికను అధికారులకు అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఐదు కోట్ల 78 లక్షల రూపాయల టీడీఆర్‌ను అందజేసింది. తప్పుడు నివేదిక అందించినట్లుగా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు గుర్తించి బాధ్యులైన కృష్ణమోహన్, కబీర్ ఉల్లా ఖాన్‌లను సస్పెండ్ చేశారు. కృష్ణమోహన్ ప్రస్తుతం ఖైరతాబాద్ సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం కబీర్ ఉల్లాఖాన్‌కు సస్పెన్షన్‌కు సంబంధించిన పత్రాలను అందించినట్లు ఉపకమిషనర్ రవికుమార్ వెల్లడించారు.

వైట్‌నర్ మత్తులో యువకుల హల్‌చల్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో వైట్‌నర్ బ్యాచ్‌లు హల్‌చల్ సృష్టించాయి. మత్తులో ఉన్న యువకులు ఒకరిమీద మరొకరు దాడి చేసుకున్నారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటన రెజిమెంటల్ బజార్‌లో చోటు చేసుకుంది. వివరాలు... రెజిమెంటల్ బజార్‌లో కొంతకాలంగా ఉదయం, రాత్రి వేళల్లో వైట్‌నర్ సేవించిన యువకులు రోడ్డుపైనే నానా హంగామా చేస్తున్నారు. మత్తులోకి జారుకున్న తరువాత ఎవరు కనిపిస్తే వారితో గొడవకు దిగడం, దాడులు చేయడం సర్వ సాధారణంగా మారిపోయింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి వైట్‌నర్ మత్తులో రెండు గ్రూప్‌లుగా విడిపోయి కట్టెలతో పరస్పర దాడులు చేసుకున్నారు. అడ్డుకునేందుకు యత్నించిన పాదచారులపై కూడా దాడికి దిగారు. సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి రాగా, వైట్‌నర్ బ్యాచ్‌లు పరారయ్యాయి.

అత్యాచారం కేసులో నేరస్తుడికి 20 ఏళ్ల జైలు

మేడ్చల్: చిన్నారిపై అత్యాచారం చేసిన యువకుడికి మేడ్చల్ కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యాంరావు తెలిపిన వివరాల ప్రకారం... శామీర్‌పేట మండలం దేవరయంజాల్ గ్రామంలో మంద సాయికిరణ్(27) 2017 మార్చి 19న చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు సాయికిరణ్‌ను అరెస్ట్ చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం మేడ్చల్ పోక్సో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా, బాలికకు మూడు లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని జడ్జి తీర్పునిచ్చారు.

22న కలెక్టరేట్ ముట్టడి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శంకర్

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ

ఆమనగల్లు: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈనెల 22న చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి శంకర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం చలో కలెక్టరేట్ పోస్టర్లను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులతో కలిసి శంకర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా బకాయి ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో వెంటనే జూనియర్ కళాశాల భవనం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు స్టాలిన్, శివ, సాయి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ప్రొఫెసర్ కోదండరాం

బడంగ్‌పేట్: అభివృద్ధి, నిరుద్యోగం మధ్య అసమానతలను అధిగమించడానికి యువతలో నైపుణ్యాలు పెంపొందించాలని తెజస అధినేత, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గురువారం నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో తెలంగాణ ఇంజనీర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. అలీ నవాజ్ జంగ్ బహదూర్ తెలంగాణలో గొప్ప దార్శనికత ఉన్న ఇంజనీర్ అని అన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ విద్యారంగంలో ఒక మార్పు తెస్తుందన్నారు. అధ్యాపకులు విద్యార్థులకు కొత్త టెక్నాలజీని బోధించాలన్నారు. కార్యక్రమంలో మాతృశ్రీ కాలేజీ చైర్మన్ పీవీఆర్ కశ్యప్, సొసైటీ కోశాధికారి సుధాకర్, జాయింట్ సెక్రటరీ వాసుదేవరావు, మెంబర్ ప్రభాకర్, ప్రిన్సిపాల్ విజయ, వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, డీన్‌లు వర్ధిని, ప్రసన్నకుమార్, గజానన, వేణుగోపాల్‌రావు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంవీఎస్‌ఆర్ అధ్యాపకులతో ప్రొఫెసర్ కోదండరాం

న్యాయవాదులకు రక్షణ చట్టం అవసరం

న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ కోర్టుల్లో నిరసనలు

సిటీ, కోర్టులు: సిద్దిపేటలో ఈ నెల 9వ తేదీన రవికుమార్ అనే న్యాయవాదిపై సిద్దిపేట ఏఎస్‌ఐ ఉమారెడ్డి దాడిని ఖండిస్తూ గురువారం న్యాయవాదులు నిరసన తెలిపారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు, సిటీ సివిల్ కోర్టుతోపాటు అన్ని కోర్టులలో ఆయా కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి రోడ్లపై బైఠాయించారు. నాంపల్లి క్రిమినల్ కోర్టులో ఏర్పాటు చేసిన సమావేశంలో నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజావర్ధన్‌రెడ్డి, తెలంగాణ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రోజురోజుకూ న్యాయవాదులపై దాడులు తీవ్రమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే న్యాయవాదులకు రక్షణగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కొత్తగా వచ్చిన చట్టాల్లో పోలీస్ అధికారులకే ఎక్కువ అధికారాలు ఉన్నాయని తెలిపారు. న్యాయవాదులను పోలీస్ అధికారులు లెక్కచేయకుండా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇంతకు ముందు భద్రాచలం, వరంగల్‌తో పాటు చాలా ప్రాంతాల్లో న్యాయవాదులపై దాడులు జరిగాయని, అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వాల తీరు ఇలాగే ఉంటే రాబోయే రోజుల్లో ఈ నిరసనలు తీవ్రమవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు రాజీరెడ్డి, జక్కుల లక్ష్మణ్, నాగేందర్, హనీఫ్ ఖాన్, నరేంద్రనాథ్, గంపా వెంకటేశం, అమర్‌గుప్తా, శేఖర్, రామాంజనేయులు, ఈశ్వర్‌కుమార్, కవిత తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల కోసం పడిగాపులు

సర్వర్లు మొరాయించడంతో గంటల తరబడి ఎదురుచూపులు



ఇబ్రహీంపట్నం రిజిస్ట్రేషన్ల కోసం జనాల నిరీక్షణ

ఇబ్రహీంపట్నం: సాంకేతిక లోపంతో సర్వర్ పనిచేయక ఇబ్రహీంపట్నంలో రిజిస్ట్రేషన్లు గురువారం నిలిచిపోయాయి. దీంతో గంటల తరబడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జనాలు పడిగాపులు కాశారు. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇ కేవైసీ సమస్యతో సర్వర్లు పనిచేయకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పలేదు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిత్యం సుమారు 100 నుంచి 130 వరకు వివిధ రకాల రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. రిజిస్ట్రేషన్‌కు క్రయ, విక్రయదారులతోపాటు సాక్షులు, ఏజెంట్లు కార్యాలయాలకు వస్తారు. తమ పనులను పక్కకు పెట్టి రిజిస్ట్రేషన్ పనిపై వచ్చిన వారు గంటల తరబడి నిరీక్షించిన ఫలితం లేకుండా పోయింది. ఈ కేవైసీ సమస్యతో రిజిస్ట్రేషన్లు జరగలేదని సబ్ రిజిస్ట్రార్ సంధ్యారాణి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య ఉందని ఆమె వివరించారు.

ఉదయం నుంచి ప్రయాస



మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చాను. సర్వర్లు మొరాయించడంతో ఇక్కడే ఉదయం నుంచి చిక్కుకు పోయాను. ఇలాంటి సందర్భాల్లో ముందస్తు సమాచారం ఇస్తే తమకు ఇబ్బందులు తప్పేవి. అధికారులు ఆ దిశగా ఆలోచించాలి.

– శివశంకర్‌రెడ్డి, చంపాపేట్

వ్యక్తి అదృశ్యం



శ్రీపాల్‌రెడ్డి (ఫైల్)

షాబాద్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపిగడ్డ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోముల శ్రీపాల్‌రెడ్డి(40) ఈ నెల 10వ తేదీన నవాబుపేట్ మండలం పూలపల్లి గ్రామంలో తన మామయ్య దశదిన కర్మకు వెళుతున్నానని తల్లి లలితకు చెప్పి వెళ్లిపోయాడు. బుధవారం రాత్రి అతనికి ఫోన్ చేయగా అది ఇంట్లోనే రింగ్ అవుతుంది. దీంతో భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే పూలపల్లి గ్రామానికి వెళ్లి అక్కడ చూడగా రాలేదని బంధువులు తెలిపారు. సోదరుడు మోముల జంగారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్‌ఐతో దురుసుగా ప్రవర్తించిన మహిళ అరెస్ట్

అల్వాల్: అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళ వీరంగం సృష్టించింది. ఎస్‌ఐ సురేష్‌తో దురుసుగా ప్రవర్తించడంతో ఆమెపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఓల్డ్ అల్వాల్ గణేష్ ఎన్‌క్లేవ్ కాలనీలో ఓ గొడవ జరిగింది. కాలనీకి చెందిన శిల్పా భర్తపై కేసు పెట్టడంతో ఆమె పోలీసులతో వాగ్వాదానికి దిగింది. ఈ క్రమంలో ఎస్‌ఐ సురేష్ చొక్కా పట్టుకొని లాగింది. దీంతో పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు.

భర్త హింసిస్తున్నాడని గర్భిణి ఫిర్యాదు

వెంగళరావునగర్: కట్టుకున్న భార్య.. అందునా గర్భిణి. అయినా అతడికి కనికరంలేదు. అనుమానం పెంచుకుని నిత్యం వేధింపులకు గురి చేస్తుండటంతో పోలీసులను ఆశ్రయించింది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌కు చెందిన జగదీష్, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఓ ప్రాంతంలో ఉండే ఓ యువతి కొన్నేళ్ల కిందట మధురానగర్‌లోని రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో పని చేసేవారు. ఇరువురి మధ్య పరిచయం ప్రేమగా మారింది. కొంతకాలం ప్రేమలో ఉన్న ఇరువురూ గతేడాది వివాహం చేసుకున్నారు. రెండు నెలలు గడవకముందే ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఇప్పుడు ఆమె ఏడునెలల గర్భవతి. ఆమె గర్భం దాల్చిన నాటి నుంచి డబ్బు కావాలంటూ తీవ్రంగా వేధిస్తున్నాడు. శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. అతడి వేధింపులకు తాళలేక ఆమె గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

29,240 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

దుండిగల్: భారీ మొత్తంలో లారీలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుబడింది. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు దుండిగల్, మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు గురువారం దుండిగల్ ఓఆర్‌ఆర్ ఎగ్జిట్-5 వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ నుంచి దుండిగల్‌కు వస్తున్న లారీని ఆపి తనిఖీలు నిర్వహించగా, ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన లారీ డ్రైవర్ షేక్ దస్తగిరి, క్లీనర్ రిజ్వాన్‌లను విచారించగా నాందేడ్‌కు చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తి తమను హైదరాబాద్ మలక్‌పేట్‌లోని అహ్మద్ హుస్సేన్‌ను కలవమని చెప్పాడని, అతను ఇచ్చే పీడీఎస్ బియ్యం లోడ్ తీసుకుని పటాన్‌చెరువులో ఓ వ్యక్తిని కలవమని చెప్పినట్లు పేర్కొన్నారు. కాగా, లారీలో 29,240 కిలోల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు దుండిగల్ సీఐ శంకరయ్య తెలిపారు. ఈ మేరకు షేక్ దస్తగిరి, రిజ్వాన్‌లపై కేసు నమోదు చేసిన పోలీసులు మిగతా నిందితులను పట్టుకునే దిశగా దర్యాప్తు చేపడుతున్నారు.

న్యాయవాదులపై పోలీసుల దాడి అమానుషం

రాజేంద్రనగర్: సిద్దిపేటలో న్యాయవాది రవి కుమార్‌పై పోలీసులు దాడి చేయడం దారుణమని రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం తిరుపతి రెడ్డి అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ తెలంగాణ పిలుపు మేరకు గురువారం రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ... సిద్దిపేట న్యాయవాదిపై పోలీసులు దాడి అమానవీయమన్నారు. చట్ట వ్యతిరేకమన్నారు. విధి నిర్వహణలో భాగంగా వేరే కేసులో నిందితుడిగా ఉన్న తన క్లయింట్ ముందస్తు బెయిల్ కోసం వెళ్లిన న్యాయవాదిపై పోలీసులు దాడి చేయడం దారుణమన్నారు. ఈ దాడిని ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. బాధిత న్యాయవాదికి న్యాయం జరగాలన్నారు. తప్పు చేసిన పోలీసుపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదులు రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. న్యాయవాదులపై కక్షపూరితంగా దాడులు చేయడం పోలీసులకు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎన్నోసార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు న్యాయవాదుల పరిరక్షణ చట్టం తీసుకురావాలని విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. న్యాయవాది తన విధి నిర్వహించే క్రమంలో ఎవరిపైన ఎలాంటి వ్యక్తిగత కక్షతో కేసులు వాదించడం జరగదన్నారు. కార్యక్రమంలో టీఎల్.శ్రీధర్ రెడ్డి, ప్రతాప్ గౌడ్, కృష్ణ నాయక్, వెంకటేశం పాల్గొన్నారు.